క్లుప్తంగా

నేడు విద్యుత్ బంద్

కుంటాల: కుంటాల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మధు ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సర్కారు బడికి చేయూత

భైంసారూరల్: మండలంలోని మాంజ్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బుధవారం దాతలు విరాళంగా సామగ్రి అందించారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి తాళ్ల శ్రీకాంత్ రూ.15 వేల విలువైన సౌండ్ బాక్స్, ఉపాధ్యాయుడు తాళ్ల ముత్తన్న రూ.10వేల విలువైన ఫర్నీచర్‌ను అందించినట్లు ఉపాధ్యాయులు సాగర్ తెలిపారు.

పాఠశాలకు బెంచీల వితరణ



బెంచీలు అందిస్తున్న దాత

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(ఆర్) గ్రామ ప్రాథమిక పాఠశాలకు బుధవారం వీడీసీ అధ్యక్షుడు, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు పుప్పాల పవన్ రూ.15 వేల విలువైన నాలుగు బెంచీలను విద్యార్థుల సౌకర్యార్థం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బొంగరాల ప్రభాకర్, బాస రోహన్, శేఖర్, సంతోష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కుభీర్: మండలకేంద్రంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న వాచ్‌ఉమెన్, కుక్ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీవాణి ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన ఎస్సీ మహిళలు ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అనాథలకు దుస్తుల పంపిణీ

ఖానాపూర్: పట్టణంలోని విశ్వశాంతి గురుకుల విద్యాలయంలో చదివే 10 మంది అనాథ చిన్నారులకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఖానాపూర్ అన్నదాత ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. విద్యార్థులతోపాటు పట్టణానికి చెందిన పేద వృద్ధురాలు నర్సవ్వకు రూ.2వేల విలువైన సరుకులు, రూ.వెయ్యి నగదు అందజేశారు. ఎస్సై రాహుల్ గైక్వాడ్, సాదుల వెంకటస్వామి, రాచమల్ల రాజశేఖర్, రాంచందర్, సుదర్శన్, వెంకటేశ్వర్లు, సుభాష్, సునీత తదితరులు ఉన్నారు.

బూట్లు పంపిణీ



బూట్లు అందుకున్న విద్యార్థులతో రాజేశ్వర్

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామ ప్రాథమిక పాఠశాలలోని 240 మంది విద్యార్థులకు బుధవారం రూ.15వేల విలువైన బూట్లు, సాక్స్‌లను మాజీ సర్పంచ్ ముత్తగౌడ్, ప్రవీణ్, సరస్వతి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జెడ్ల రాజేశ్వర్, ఉపాధ్యాయులు నాగభూషణ్ ఉన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామ వాసవి ఓలంపియాడ్ పాఠశాలలో బుధవారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు అలరించగా ఉట్టి కొట్టే వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ హర్షవర్ధిని, సాగరికకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా అంగారక చతుర్థి

కుంటాల:మండలంలోని ఓలా శివాలయంలో బుధవారం వేకువ జామున ఘనంగా అంగారక చతుర్థి(సంకటహర చతుర్థి) నిర్వహించారు. విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలనంతరం.. పసుపుతో వినాయకుడి ప్రతిమ తయారు చేసి దీపారాధన చేశారు. శోడశోపచార, పత్రి పూజచేసి వినాయకుడికి నైవేద్యంగా ఉండ్రాళ్లను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కుంటాల: మూడు రోజులపాటు భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. బుధవారం మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయాలకు ఎంపీడీవో వనజ, ఎంపీవో రహీంఖాన్ వెళ్లి కార్యదర్శులతో గ్రామాల్లో మైక్ ద్వారా లోతట్టు వంతెనలపై ప్రయాణం వద్దని విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండరాదని చెప్పించారు.

కొనసాగుతున్న సప్తమి వేడుకలు

కుంటాల: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా కుంటాలలో సప్తమి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. హనుమాన్ ఆలయంలో ఏకతాళం, భజనలో భక్తులు పాల్గొన్నా రు. శ్రీకృష్ణ, హనుమాన్ ఆలయాల్లో పూజలు చేశారు.

గుంతల రోడ్లతో కష్టాలు

- మంజులాపూర్‌లో అధ్వానంగా అంతర్గత రోడ్లు
- అవస్థలు పడుతున్న కాలనీవాసులు
- పట్టించుకోని పాలకులు ,అధికారులు



కాలనీలో ప్రమాదకరంగా గుంత



డ్రెయినేజీలు లేకపోవడంతో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని 19వ వార్డు పరిధిలోని మంజులాపూర్–శివాజీనగర్‌లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. అసలు డ్రెయినేజీలు కానరావడం లేదు. ఎక్కడికక్కడ ఏర్పడిన గుంతల్లో చిన్నపాటి వర్షానికే నీరు నిలువడంతో బాటసారులు, ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో మురుగునీరంతా కాలనీ రోడ్లపైకి వచ్చి చేరుతోంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు, పాలకులకు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు.

మూడు వేల జనాభా..

ఈ కాలనీలో సుమారు 3వేల మంది జనాభా ఉండగా 800కు పైగా నివాసాలున్నాయి. ఇంటికో



కాలనీ రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంతలు

వాహనం ఉంది. ఈ గుంతల రోడ్లపై వాహనాలు నడపితే వెన్ను సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నామని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. గుంతల రోడ్ల కారణంగా స్కూల్ బస్సులు సకాలంలో పాఠశాలకు చేరడం లేదు.

పట్టించుకోని పాలకులు, అధికారులు

కాలనీ సమస్యలపై అధికారులు, పాలకులను కలిసి విన్నవించినా పట్టించుకోవడంలేదని కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా నూతన రోడ్లు వేయించి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

రోడ్లు బాగు చేయించండి



కాలనీలో అంతర్గత రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. దీంతో వాహనాలపై వెళ్లేటప్పుడు స్కిడ్ అయి ప్రమాదాలు జరుగుతున్నాయి. బైక్‌పై వెళ్తుంటే బొక్కలు కదిలినట్లు అవుతున్నాయి. అధికారులు స్పందించి కాలనీలోని రోడ్లను బాగు చేయించాలి.

– శంకర్‌యాదవ్, మంజులాపూర్ కాలనీ

మాదకద్రవ్యాలకు దూరం ఉండాలి

భైంసాటౌన్: యువత మాదక ద్రవాలకు దూరంగా ఉండాలని భైంసాలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.బుచ్చయ్య అన్నారు. బుధవారం కళాశాలలో 'మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలకు దూరం ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మల్: మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరం ఉండాలని నర్సాపూర్(జి) జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పురుషోత్తం, పీడీ దర్శనం దేవేందర్ అన్నారు. 'నషా ముక్త్ భారత్' సందర్భంగా నర్సాపూర్ (జి) జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు, యువత భాగస్వాములవ్వాలని సూచించారు.

కుంటాల: నషాముక్త్ భారత్–ప్రతిజ్ఞ కార్యక్రమంలో భాగంగా బుధవారం కుంటాల ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ఎత్రాజ్‌రాజు, రాథోడ్ సురేశ్, ఎస్సై అశోక్, డ్రగ్స్ నిరోధక కమిటీ కౌన్సిలర్ జాదవ్ ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు తీసు



కుంటాల ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అశోక్

కోవాల్సిన చర్యలపై కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సరిత అవగాహన కల్పించారు. ఈ విషయమై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి సంతోష్‌రెడ్డి, స్టూడెంట్ కౌన్సిలర్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరం ఉండాలని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏక్ పేడ్ మాకే నామ్‌లో భాగంగా ఆవరణలో మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు మాధవ్‌రావ్, సుదర్శన్, రజనీకాంత్, సుజాతదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్: మాదకద్రవ్యాల మత్తు నుంచి యువతను దూరం ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పట్టణ ప్రవీణ్‌కుమార్ అన్నారు. నషా ముక్త్



తానూరు: మొక్క నాటుతున్న విద్యార్థులు, టీచర్లు



నిర్మల్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసు అధికారులు

భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం ప్రాంతంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముందుగా ప్రజలతో డ్రగ్స్ రహిత సమాజాన్ని అనుసరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల రవాణా, వినియోగం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఇందులో పట్టణ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని రైతువేదికలో బుధవారం ఆధార్ సెంటర్ ప్రారంభించారు. మండలంలోని పలు గ్రామాల చిన్నారులు తమ ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి పరిశీలించారు. ఆధార్ అప్‌డేట్ లేక అంగన్‌వాడీ చిన్నారులకు పోషకాహారం అందించే సమయంలో ఇబ్బందులు ఏర్పడేవని పేర్కొన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు ఈ శిబిరం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో కేంద్రం ఇన్‌చార్జి జాకీర్ ఉన్నారు.

'ఇన్‌గేట్ మూసివేయొద్దు'

ఖానాపూర్: పట్టణంలోని బస్టాండ్ చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్న అధికారులు ఇన్‌గేట్ మూసివేస్తే ఆందోళన చేస్తామని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నంది రామయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నూతన్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. గతంలో ఇన్‌గేట్‌ను మూసివేయడం ద్వారా రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడ్డారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భూక్యా రమేశ్, తిరుపతి, శ్రీనివాస్, నర్సయ్య, శంకర్, భూమన్న తదితరులు ఉన్నారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా!



సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామ పదోవార్డులో రోడ్డుపై వర్షపునీరు నిలవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ఇళ్ల నుంచి బయటకు రాలేని విధంగా రోడ్డు మారింది. అధికారులు రోడ్డుపై మొరం పోయించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బీమా చెక్కు అందజేత

ముధోల్: మండలంలోని చించాల గ్రామానికి చెందిన పెక్కంటి లక్ష్మి అనే మహిళ ఇటీవల మృతిచెందగా ఆమె పేరిట పీఎంజేబీవై పథకం కింద రూ.2లక్షల బీమా చెక్కు మంజూరైంది. బుధవారం టీజీబీ ఎడ్‌బిడ్ మేనేజర్, ఏపీఎం, మహిళా సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో చెక్కును బాధిత కుటుంబీకులకు అందజేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

ముధోల్: మండలకేంద్రంలోని తానూరు బైపాస్ రోడ్డు వద్ద బోగడ వాడకట్టు హనుమాన్ మందిరంలో బుధవారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ముధోల్‌లో దొంగతనాలు జరుగుతున్నందున మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో 4 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రోళ్ల రమేశ్ అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పోతన్న, ఈరన్న, సాయినాథ్, గంగాధర్, పోశెట్టి, శంకర్, దత్తు తదితరులు పాల్గొన్నారు.



అధ్వానంగా పరిసరాలు

'డబుల్' ఇళ్లను పట్టించుకోరూ

సొంతింటి కల నెరవేర్చేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలోని సిద్దాపూర్ శివారులో 600 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించారు. లక్కీడ్రా పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ వారికి ఇళ్లను కేటాయించలేదు. ప్రస్తుతం ఈ డబుల్ ఇళ్ల పరిసరాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారి పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. పలు ఇళ్ల వద్ద అసంపూర్తి పనులు దర్శనమిస్తున్నాయి. ఇళ్లు కేటాయించాలని కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



ఇళ్ల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు



అసంపూర్తిగా పనులు

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

దస్తురాబాద్: మండలంలోని మున్యాల పంచాయతీ పరిధి పెద్దూర్ గ్రామానికి చెందిన సంఘ సురేశ్(35) ఉజ్బెకిస్థాన్ దేశంలో గత నెల 22న గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబానికి ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పరామర్శించి రూ.ఐదు వేలను ఆర్థికసాయంగా అందించారు. అధైర్యపడొద్దని.. అండగా ఉంటామని పేర్కొన్నారు. సురేశ్ మృతదేహం స్వగ్రామానికి తీసుకొచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సమాజసేవలో యువత భాగస్వాములవ్వాలి

- ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



పాఠశాలలో విద్యార్థులకు షూస్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసారూరల్: సమాజ సేవలో యువత భాగస్వాములు కావాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బీజేపీ మండల నాయకులు పండిత్‌రావు సమకూర్చిన రూ.21వేల విలువైన షూస్‌ను 95 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవిద్యార్థులకు సహకారం అందించేందుకు దాతలు ముందుకురావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను గ్రామస్తులే పరిరక్షించుకోవాలని పేర్కొన్నారు. మెరుగైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈవో సుభాష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులకు సన్మానం

భైంసాటౌన్: ఉద్యోగ విరమణ పొందిన మాజీ సైనికులను ఎమ్మెల్యే రామారావు పటేల్ బుధవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని తన నివాసంలో మాజీ సైనికులు ఆకుల గోపాల్, సిలారం సంతోష్, కేసరి, మల్లేశ్, సంతోష్‌ను శాలువాతో సత్కరించి మాట్లాడారు. దేశ రక్షణలో సైనికుల పాత్ర ఎనలేనిదని, వారిని సత్కరించుకోవడం మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేశ్, భీంరావు, పట్టణాధ్యక్షుడు రాము, మండలాధ్యక్షురాలు సుష్మ, తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ గోవర్ధన్‌రెడ్డి

సోన్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సోన్ సీఐ గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాక్‌పట్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రా మస్తులకు సీసీ కెమెరాలతో కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఆలయాలతోపాటు, వ్యాపార సముదాయాలు, ప్ర భుత్వ కార్యాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎస్సై గోపి, పోలీస్ సిబ్బంది, వీడీసీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

సాఠే ఆశయ సాధనకు కృషి చేయాలి



జెండావిష్కరణలో పాల్గొన్న నాయకులు

తానూరు: సాహిత్యరత్న అన్నాభావు సాఠే ఆశయ సాధనకు కృషి చేయాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండలంలోని మొగ్లి గ్రామంలో అన్నభావు సాఠే 105వ జయంతి నిర్వహించారు. దళితులు ఉన్నత చదువులు చదివి గొప్పస్థానాల్లో నిలవాలన్నారు. అనంతరం బీఆర్ అంబేడ్కర్, సాఠే చిత్రపటాలకు నివాళులర్పించి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అన్నాభావు సాఠే కమిటీ అధ్యక్షుడు నీడస్కర్ పరమేశ్వర్, అనిల్, వీడీసీ అధ్యక్షుడు సాయినాథ్, జ్ఞానేశ్వర్, భీంరావ్, లక్ష్మణ్, షాదుల్, సాయిప్రసాద్, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు అందజేత

ఖానాపూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని.. ఇందులో విద్యార్థులు భాగస్వాములు కావాలని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం నరేందర్‌రావు అన్నారు. ఇటీవల విద్యార్థులు తమ తల్లులతో కలిసి మొక్కలు నాటిన ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినందుకు మంజూరైన ధ్రువీకరణ పత్రాలను బుధవారం పాఠశాల ఆవరణలో అందించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అంతకుముందు పాఠశాల ఆవరణలో పలు మొక్కలు నాటారు.

అంబేడ్కర్ భవన నిర్మాణం నిలిపివేయాలి



శ్రీహరిరావుకు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న అంబేడ్కర్ సంఘ భవన నిర్మాణం నిలిపివేయాలని కోరుతూ బుధవారం నిర్మల్‌లో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావుకు స్థానిక మాదిగ సంఘం సభ్యులు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. 50 ఏళ్ల కిందట మాదిగ, మాల సామాజిక వర్గాల అభివృద్ధి కోసం నిర్మించిన దుకాణాల సముదాయం, హరిజనవాడ పాఠశాల భవనాలను అనుమతులు లేకుండా కూల్చివేశారన్నారు. ఆ ప్రదేశంలోనే నిర్మిస్తున్న అంబేద్కర్ సంఘ భవనం నిర్మాణం నిలిపి వేయాలని కోరారు. ఆ స్థలాన్ని ఇరువర్గాలకు సమానంగా పంచాలని కోరారు. కార్యక్రమంలో నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, మాజీ సర్పంచులు అట్ల రాంరెడ్డి, నారాయణ, ఓస రాజేశ్వర్, నాగేశ్, సాయన్న, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



భైంసారూరల్: జలాభిషేకం చేస్తున్న సుష్మారెడ్డి

నిర్మల్: నర్సాపూర్ (జి) జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఆవిష్కరించాలని కోరారు. ఎస్సై గణేశ్, హెచ్‌ఎం పురుషోత్తం, పీడీ దేవేందర్, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

కుభీర్: హర్ ఘర్ తిరంగాలో భాగంగా మండలకేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయజెండాలతో ర్యాలీ తీశారు. పంచాయతీ కార్యాలయం ఎదుట మానవహారంలో పాల్గొన్నారు. హెచ్‌ఎం గంగాధర్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ పార్థసారథి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి జలాభిషేకం

భైంసారూరల్: హర్ ఘర్ తిరంగాలో భాగంగా మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో బుధవారం రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ మండల అధ్యక్షురాలు సుష్మారెడ్డి జలాభిషేకం చేశారు. ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో భాగంగా ప్రధాని మోడీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రమేశ్ తదితరులు ఉన్నారు.

కవితను కలిసిన జానుబాయి



కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జానుబాయి

ఖానాపూర్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బుధవారం పెంబి మాజీ జెడ్పీటీసీ జానుబాయి మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కలిసి పలు సమస్యలపై చర్చించారు. రానున్న బతుకమ్మ ఉత్సవాలకు ఖానాపూర్ నియోజకవర్గంలో పర్యటించాలని కోరగా ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు. అంతకుముందు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఆమె వెంట రైతు నాయకుడు హపావత్ రాజేందర్ ఉన్నారు.